క్లుప్తంగా

దిశ వన్ స్టాప్ సెంటర్‌లో సేవలపై ఆరా



విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజేశ్వరి

ఏలూరు (టూటౌన్) : రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమ్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా మహిళా శిశు సంక్షేమం, సాధికారత సంస్థ ఆధ్వర్యంలో ఉన్న దిశవన్ స్టాఫ్ సెంటర్‌ను బుధవారం డీఎల్ఎస్ఏ కార్యదర్శి జి.రాజేశ్వరి సందర్శించారు. ఈ సెంటర్‌కు వచ్చే వివిధ రకాల కేసుల వివరాలపై ఆరా తీశారు బాధితులకు అందించే సేవలు, కౌన్సెలింగ్ విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె పలువురికి కౌన్సిలింగ్ ఇచ్చారు. వన్ స్టాఫ్ కార్యాలయ ఫైల్స్, కేసుల రిజిష్టర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సెంటర్ అడ్మిన్ సీహెచ్ నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మికి అవార్డు



భాగ్యలక్ష్మిని సత్కరించిన ఉపాధ్యాయులు

ఏలూరు రూరల్ : వెంకటాపురం శ్రీరామ్‌నగర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు సాధనాల భాగ్యలక్ష్మికి సావిత్రిబాయి పూలే అవార్డు దక్కింది. సావిత్రబాయి పూలే 192వ జయంతి సందర్భంగా కాకినాడ సేవాసమితి మంగళవారం ఎక్సైజ్, ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ ఏనుగుల చైతన్యమురళి చేతుల మీదుగా ఆమెకు ఈ అవార్డు అందించింది. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో హెచ్ఎం బేధాళ సుదర్శనం, ఉపాధ్యాయురాలు ఆమెను ఘనంగా సత్కరించారు. సుదర్శనం మాట్లాడుతూ భాగ్యలక్ష్మికి ఉపాధ్యాయ వృత్తిపట్ల గౌరవం, పిల్లల పట్ల ప్రేమ కారణంగా అవార్డు దక్కిందన్నారు. ఆమెకు శాలువ కప్పి అభినందించారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

దెందులూరు: అసాంఘిక కార్యకలాపాలకు యువత దూరంగా ఉండాలని ఎస్సై ఐ. వీర్రాజు అన్నారు. బుధవారం గోపన్నపాలెం పీఈటీ కళాశాల గ్రౌండ్‌లో ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశాల మేరకు సంక్రాంతి క్రికెట్ పోటీలను ఎస్సై ప్రారంభించారు. నిర్వాహకులు జి.చందు మాట్లాడుతూ బుధవారం నాలుగు జట్ల మధ్య క్రికెట్ పోటీలు జరిగాయన్నారు. సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్ పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే లక్ష్యం

డిప్యూటీ మేయర్ సుధీర్‌బాబు



రాణీనగర్‌లోని సచివాలయం వద్ద సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు

ఏలూరు టౌన్: రాష్ట్రంలో పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఏలూరు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు అన్నారు. స్థానిక రాణీనగర్‌లోని 10వ సచివాలయం పరిధిలో ఇటీవల ఒక మహిళ సహజ మృతి చెందగా, ఆమె కుమారుడి ఖాతాలో వైఎస్సార్ బీమా పథకంలో రూ.1 లక్ష సొమ్ము ప్రభుత్వం జమ చేసింది. ఈ సందర్భంగా నూతనంగా మంజూరైన ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులు, పింఛన్లు, బీమాను సుధీర్ బాబు పలువురికి అందజేశారు. అనంతరం ఆయా పథకాల్లో లబ్ధిదారులంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సుధీర్ బాబు మాట్లాడుతూ దేశంలోనే ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా మన రాష్ట్రంలోనే అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోన్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. కుల, మత ప్రాంతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. ఏలూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఆళ్ల నాని సారథ్యంలో పేదలకు ఇళ్లు మంజూరు చేశారని, ఇళ్లు కట్టిస్తున్నారని చెప్పారు. ఏలూరు నగరంలో అనేక అభివృద్ధి పనులు సాగుతున్నాయని తెలిపారు. కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్ మాట్లాడుతూ ఏలూరు నగరాభివృద్ధిపై ఎమ్మెల్యే నాని ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నారని వివరించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆయా పథకాల లబ్ధిదారులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష తులసీ పూజ



ప్రత్యేక అలంకరణలో ఆర్ఆర్‌పేట వేంకటేశ్వరస్వామి

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన, తదితర పూజలు చేశారు. విష్ణు సహస్రనామ పారాయణ చేసి స్వామి వారి నిత్య హోమాలు, నిత్య కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి లక్ష తులసి పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం ప్రదర్శించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అకట్టుకున్నాయి. సాయంత్రం 5 గంటల నుంచి పి.పృథ్వీ సాయి తులసి, పి.ఉషా లావణ్య అన్నమాచార్య సంకీర్తనామృతం పేరిట అన్నమాచార్య కీర్తనలు ఆలపించి వీనుల విందు చేశారు. అనంతరం శ్రీనివాస మంగాపురం వశిష్టాశమ లలితా పీఠాధిపతి స్వరూపానంద గిరి స్వామి శంకరాచార్య విరచిత సాధన పంచకం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. రాత్రి 7.30 గంటలకు విజయవాడ హంసధ్వని కూచిపూడి నృత్యాలయ ఆధ్వర్యంలో నాట్యాచార్యులు సీహెచ్ అజయ్ కుమార్ బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అబ్బుర పరిచాయి. ఆలయ అర్చకులు కిశాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు విశేష పూజలు చేయగా, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, కార్యనిర్వహణాధికారి ఆంధ్ర రవిశంకర్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.



నాట్యాచార్య అజయ్ కుమార్ శిష్యుల కూచిపూడి నాట్య విన్యాసం

సమాజ శ్రేయస్సు కోసం పనిచేయాలి



ఐఏఎల్ క్యాలెండర్, డైరీని విడుదల చేస్తున్న నాయకులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న బేతాళ సుదర్శనం

ఏలూరు (టూటౌన్): న్యాయవాదులు సమాజ శ్రేయస్సు కోసం పనిచేయాలని ఐఏఎల్ జిల్లా నాయకులు సీనియర్ న్యాయవాది పీఎస్ చందూ అన్నారు. స్థానిక ఆర్ఆర్‌పేట స్ఫూర్తి భవన్‌లో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఏపీ రాష్ట్ర కమిటీ ముద్రించిన 2023 కోర్టు టేబుల్ క్యాలెండర్, డైరీని బుధవారం ఆయన విడుదల చేశారు. 1983లో జస్టిస్ వీఆర్ కృష్ణయ్యర్ నాయకత్వంలో జస్టిస్ పీఎస్ భగవతి కార్యదర్శిగా భారత దేశంలో ఐఏఎల్ ఏర్పడిందని చందూ చెప్పారు. రాష్ట్రంలో విజయవాడ కేంద్రంగా ఐఏఎల్ రాష్ట్ర కమిటీ పనిచేస్తోందని, ఐఏఎల్ ముద్రించిన టేబుల్ క్యాలెండర్ న్యాయవాదులకు, న్యాయస్థాన సిబ్బందికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. న్యాయవాదులు సొంతంగా వృత్తి నైపుణ్యం పెంచుకునేలా ఐఏఎల్ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఐఏఎల్ ప్రతినిధులు బండి వెంకటేశ్వరరావు, సబ్బి అజయ్ కుమార్, బలగం బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

డైరీలు, క్యాలెండర్ల విడుదల

ఏలూరు (టూటౌన్): బహుజన సిద్ధాంత భావజాల డైరీలు, క్యాలెండర్లను స్థానిక పెద్దపోస్టాఫీసు ఆవరణలోని ఎస్సీ, ఎస్టీ పోస్టల్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో బుధవారం విడుదల చేశారు. అమ్మ క్రాంతి సావిత్రి బాయి పూలే జయంతిని పురస్కరించుకుని ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆఫ్ ఆల్ ఇండియా జాతీయ అధ్యక్షుడు దేవర కొండ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన భారతీయ బౌద్ధ మహాసభ, సమత సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు బేతాళ సుదర్శనం బహుజన పితామహులు, మాతామహులు అత్యంత త్యాగపూరితంగా చేసిన సామాజిక పోరాటాలను వివరించారు. పలువురు నాయకులు తమ తమ అభిప్రాయాలను వెల్లడించారు. కార్యక్రమంలో యాదవ సంఘం రాష్ట్ర నాయకులు ఉక్కుసూరి గోపాలకృష్ణ, దాసి లీలా మోహన్, చొప్పల సాయిబాబా, మేతర అజయ్ బాబు, జిజ్జివరపు ప్రతాప్ కుమార్, కందుల రమేష్, సాయిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లోనూ రాణిస్తున్న దివ్యాంగులు



దివ్యాంగ చిన్నారికి బహుమతి అందిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట)/ఏలూరు రూరల్: దివ్యాంగులు అన్ని రంగాల్లోనూ రాణిస్తుండడం ఆహ్వానించదగ్గ పరిణామమని ఎంఈఓ సబ్బితి నరసింహమూర్తి అన్నారు. ఏలూరు భవిత కేంద్రంలో బుధవారం నిర్వహించిన లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దివ్యాంగులకు ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తోందని, వాటిని అందిపుచ్చుకుని సాధారణ వ్యక్తులతో సమానంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. దివ్యాంగుల అభివృద్ధికి భవిత కేంద్రాల ద్వారా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, దివ్యాంగులు తల్లిదండ్రులు సైతం తమ బిడ్డల కోసం ఎన్నో త్యాగాలు చేయడం అభినందనీయమని అన్నారు. కాకినాడకు చెందిన తండ్రీకుమార్తెలు బొల్లింకల రాజారెడ్డి, కృష్ణశ్రీప్రీతి భవిత కేంద్రంలో చిన్నారులకు బహుమతులు, భోజన ఏర్పాట్లు చేశారు. ప్రధానోపాధ్యాయుడు ఆర్.నాగేంద్ర సింగ్, భవిత కేంద్రం ఉపాధ్యాయురాలు ఎస్.శ్రీదేవి పాల్గొన్నారు.

మిగులు భూములు పంపిణీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవి

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో ఉన్న అన్ని రకాల మిగులు భూములను పేదలకు పంచాలని, 9/77 చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. స్థానిక అన్నే భవన్‌లో పేదలకు భూములను పంచాలని కోరుతూ బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి మాట్లాడుతూ స్వాతంత్ర్య అనంతరం 1954 నుంచి 2009 వరకు అనేక పోరాటాల వల్ల రాష్ట్రంలో సుమారు 30 లక్షల ఎకరాలకు పైగా పేదలకు ప్రభుత్వాలు అసైన్డ్ చేశాయన్నారు. ఈ భూముల్లోని సుమారు 15 లక్షల ఎకరాల భూమిని పలుకుబడున్నవారు, పెత్తందార్లు, రాజకీయ నాయకులు, దళారీలు లాక్కున్నట్లు కోనేరు రంగారావు భూ కమిటీ తెలిపిందని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం అసైన్డ్ భూములను రెగ్యులర్ చేయాలా? వద్దా? అని విచారించేందుకు మంత్రి ధర్మాన ప్రసాదరావు నేతృత్వంలో నియమించిన మంత్రులు, ఎమ్మెల్యేలతో కమిటీని రద్దు చేయాలని కోరారు. సమావేశంలో బీకేఎంయూ జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ఏఐడీఆర్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్ మనీసింగ్, బీసీ సంఘాల జేఏసీ నాయకులు ఉక్కుసూరి గోపాలకృష్ణ, నేతల రమేష్, మేతర అజయ్ బాబు, రైతు సంఘం నాయకులు కె.శ్రీనివాస్, చేతివృత్తిదారుల సంఘం నాయకులు పి.ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజానికి ఉపయోగపడాలి



ప్రొఫెసర్ ఉదయ భాస్కర్‌ను సన్మానిస్తున్న కళాశాల ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ప్రస్తుత పోటీ ప్రపంచం పరిశోధనలపై ఆధారపడి ఉందని, ప్రతి విద్యార్థి ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, ఆ పరిశీలనే పరిశోధనకు ఉపయోగపడుతుందని ఆదికవి నన్నయ యూనివర్శిటీ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ ఎస్.ఉదయభాస్కర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక సీఆర్ఆర్ పీజీ కళాశాలలో బుధవారం ఎంబీ, ఎంకామ్, సీఐఐ ఒడ్ ఈడీసీ, ఐక్యూఏసీ విభాగాల ఆధ్వర్యంలో డేటా సేకరణ అనే అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమంలో ఉదయ భాస్కర్ ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. సమాజానికి, దేశానికి ఉపయోగపడే పరిశోధణాంశాన్ని విద్యార్థులు ఎంచుకోవాలని, పరిశోధనల్లో అత్యున్నత డిగ్రీలు సాధించడం ద్వారా సమాజానికి ఉపయోగపడాలని పిలుపునిచ్చారు. ఉదయ భాస్కర్‌ను కళాశాల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ కేపీ రామరాజు, పీజీ కోర్సుల డైరెక్టర్ కొండయ్య రావు, ఎంబీఏ విభాగాధిపతి ఆర్.శ్రీనివాస రావు, సీఐఐఈ, ఈడీసీ కోఆర్డినేటర్ తేరా రాజేష్, ఎంబీఏ అధ్యాపకురాలు వై.సౌజన్యపాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	44	చిక్కుడు కాయలు	56
వంకాయలు (కాంతులు)	50	చామదుంపలు	56
వంకాయలు (తెలుపు)	22	ములక్కాడలు	12-15
బెండకాయలు	48	కంద	36
పచ్చిమిర్చి	36	బీట్‌రూట్	38
కాకర కాయలు	34	కీరా దోస	56
బీరకాయలు	36	ఫ్రెంచ్‌బీన్స్	66
బీరకాయలు (పందిరి)	48	అల్లం	60
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	40	పాలకూర	10
దొండకాయలు	48	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	26	గోంగూర	06
గోరుచిక్కుడు	46	పుదీనా	05
దోసకాయలు	34	బఠాణి	--
ఆనబకాయ (1)	25-20	క్యాప్సికమ్	64
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	24-34

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	37
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	35
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	25
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	32
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	27
ఏలూరు -తిరుపతి	16.00	4830	34
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	29

యాదవ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడిగా దుర్గాప్రసాద్



సమావేశంలో పాల్గొన్న యాదవ సంఘం నాయకులు

ఏలూరు (టూటౌన్): యాదవ ఎడ్యుకేషనల్ సొసైటీ నూతన అధ్యక్షుడిగా గోళ్ల దుర్గాప్రసాద్ ఈ నెల 8న ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఏలూరులోని యాదవ సంఘం జిల్లా కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు చిదరబోయిన శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక అమీనాపేట ఏటిగట్టు ప్రాంతంలోని జిల్లా యాదవ సంఘ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన జిల్లా యాదవ ఎడ్యుకేషనల్ సొసైటీ నూతన కమిటీ ఏర్పాటు సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదవుల సంక్షేమం, అభివృద్ధికి, వారి పిల్లలు చదువులకు సహకరించేందుకే యాదవ ఎడ్యుకేషనల్ సొసైటీని స్థాపించినట్లు చెప్పారు. జిల్లాలోని యాదవ విద్యార్థులకు అండగా యాదవ ఎడ్యుకేషనల్ సొసైటీ సేవలను అందజేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో యాదవ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ, జిల్లా గౌరవ అధ్యక్షులు కిలారపు బుజ్జి, జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టా ఈశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

కుటుంబ అభ్యున్నతికి స్త్రీ విద్య అవసరం



విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న సతీష్ చౌదరి

పెదపాడు: సమాజంలో కుటుంబ అభ్యున్నతికి స్త్రీ విద్య ఎంతో అవసరమని జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఆళ్ల సతీష్ చౌదరి తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరు సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను సతీష్ చేతల మీదుగా అందించారు. ఈకార్యక్రమంలో వట్లూరు గ్రామ సర్పంచ్ గుజ్జుల రత్నకుమారి స్థానిక నాయకులు గుజ్జుల నవీన్ పాఠశాల ప్రిన్సిపాల్ మేరీ ఝాన్సీరాణి పాల్గొన్నారు.

జూదరుల బైండోవర్

ఉంగుటూరు: కోడిపందేలు, జూదం, గుండాట నిర్వహించే వందమందిని గుర్తించి ముందస్తుగా బైండోవర్ చేసినట్టు చేబ్రోలు ఎస్సై స్వామి తెలిపారు. వారిపి తహసీల్దారు ముందు హాజరుపర్చామని సొంతపూచీ కత్తుపై తిరిగి విడుదల చేశామని తెలిపారు. కోడిపందేలు, గుండాట పేకాట నిర్వాహకులపై బైండోవర్ నమోదు చేశామని ఎస్సై వివరించారు.

నేడు పెదవేగిలో కొత్త పింఛన్ల పంపిణీ

పెదవేగి : దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి చేతుల మీదుగా నూతనంగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించనున్నట్టు ఎంపీపీ తాతా రమ్య చెప్పారు. బుధవారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు కొత్తగా మంజూరైన పెన్షన్లు, రేషన్‌కార్డులు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొంటారని, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు ఆయా పరిధిలోని లబ్ధిదారులను సభకు తీసుకురావాలని ఎంపీపీ సూచించారు.

ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఐక్య ఉద్యమం

దెందులూరు: నాగన్నగూడెంలో బుధవారం ఎంఎస్పీ ఆవిర్భావ దినోత్సవాన్ని దెందులూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కే.మురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత జెండాను ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగాల శేఖర్ ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. ఎంఆర్‌పీఎస్ ఏకైక డిమాండ్ అయిన ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

నియోజకవర్గంలో 37,500 పెన్షన్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలో 37,500 పెన్షన్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్నారని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. బుధవారం దెందులూరు కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అధ్యక్షతన దెందులూరు మండలంలో నూతనంగా మంజూరైన పెన్షన్‌దారుల పంపిణీ వారోత్సవాల్లో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ముఖ్య అతిథిగా విచ్చేశారు. నూతన పెన్షన్లను 295 మంది లబ్ధిదారులకు ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే అందజేశారు. మూడున్నరేళ్లలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తుంటే టీడీపీ, ఎల్లోమీడియా వాస్తవాలను వక్రీకరించి ప్రచారం చేస్తున్నాయని ఎమ్మెల్యే ఆరోపించారు. 'దుగ్గిరాలలోనైనా, మరెక్కడైనా అభివృద్ధి, సంక్షేమంపై చర్చకు సిద్ధమంటూ' ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి బహిరంగంగా సవాలు విసిరారు. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ కార్యక్రమాల పంపిణీలో భాగంగా దెందులూరు నియోజకవర్గానికి రానున్నారని ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ ప్రాంతం విద్యార్థులకు ఉన్నత చదువు అందుబాటులోకి తెచ్చేందుకు దెందులూరులో జూనియర్ కళాశాల మంజూరు చేయించి, తరగతులు ప్రారంభించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో నియోజకవర్గంలో మరిన్ని జూనియర్ కళాశాలలు ప్రారంభమవుతాయన్నారు. 8వ తరగతి విద్యార్థులకు సాంకేతిక విద్యాబోధన అందించేందుకు ట్యాబ్‌లను పంపిణీ చేసి విద్య పట్ల తనకున్న మక్కువను సీఎం జగన్ తెలియచేశారని వివరించారు.